క్లుప్తంగా

ముగిసిన జైనబ్బీ అమ్మవారి ఉరుసు


అమ్మవారి జీవసమాధి వద్ద జియారత్ ఫాతెహా చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి జియారత్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి జీవసమాధిని విశేష పుష్పాలతో చాదర్‌తో అలంకరించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, కమిటీ సభ్యులతో కలిసి జీవసమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బ్యాళ్ల ప్రసాద్, జెండా జిలాన్, జీఎంఎస్ షాకీర్, మైనుద్దీన్, పామిడి జాకీర్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలి

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓ గౌస్‌సాహెబ్ పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలో సర్పంచ్‌తోపాటు అధికారులు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈసందర్భంగా క్లాక్ టవర్ నుంచి బాలాజీ థియేటర్ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, గాంధీచౌక్, రంగావీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఎంఈఓ ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో సినిమా షూటింగ్


చిత్రంలో ఓ ఫైట్ సీన్‌ను చిత్రీకరిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ సమీపంలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. పుష్ప సినిమాలో నటించిన జగదీష్ (కేశవా), పుష్ప తల్లిగా నటించిన కల్పలత ఇద్దరు నటీనటులు ఈ సినిమాలో మెయిన్ రోల్ నటిస్తున్నట్లు చిత్ర బృందం సభ్యులు తెలిపారు. ఈ చిత్రంలో హీరోగా జగదీష్, హీరోయిన్‌గా సహారా, హీరో తల్లిగా కల్పలత, సినిమా డైరెక్టర్‌గా ఆర్యన్ సుభాష్ యష్ , శృతి ఈ సినిమాను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

సురవరం సేవలు చిరస్మరణీయం


సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రాయదుర్గంటౌన్: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు అని రాయదుర్గం సీపీఐ ఇన్‌చార్జ్ నాగార్జున తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, దుర్గన్న, తేజ, పీరా సాబ్, మారన్న, నాగరాజు పాల్గొన్నారు.

పింఛన్ తొలగించి అన్యాయం చేయొద్దు


పింఛన్ కట్ చేయడంతో విలపిస్తున్న లతకుమారి

రాయదుర్గంటౌన్: పింఛన్ తొలగించి అన్యాయం చేయొద్దని బాధితురాలు దేశాయి లతకుమారి కోరుతోంది. పట్టణ, రూరల్ పరిధిలో దాదాపు 247 పింఛన్లు రీ వెరిఫికేషన్‌లో పింఛన్‌కు అనర్హులంటూ నిలిపివేయడంతో బధిరులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 9వ వార్డు చౌడమ్మ గుడి ఏరియాలో నివాసం ఉంటున్న ఓ అంధత్వ పింఛన్‌దారు దేశాయి లతకుమారికి ఇటీవల నోటీసు అందజేశారు. దీంతో ఆమె అన్యాయం చేయొద్దని ప్రభుత్వాన్ని మొరపెట్టుకుంటోంది. తాను అంధత్వం, కంటి నరాల బలహీనతతో బాధపడుతున్నట్లు తెలిపింది. దీంతో సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చినట్లు ఆమె ఆవేదన చెందుతోంది.

కనుల పండువగా కృష్ణాష్టమి

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యం గ్రామంలో యాదవులు ప్రత్యేకంగా ఐదు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శనివారం భారీ ఎత్తున శ్రీకృష్ణుడి చిత్రపటాలను ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా గ్రామాల్లో వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం వందలాది మంది యాదవులు పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సారూ..కార్యాలయంపై శ్రద్ధ చూపరూ


శిథిలావస్థకు చేరిన ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం


పేకాట, మందు బాబులకు నిలయంగా మారిన ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయ ప్రాంగణం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం
- భవనానికి కొరవడిన భద్రత

ఉరవకొండ: స్థానిక మాస్టర్ సీవీవీ నగర్ శివారులోని సాంఘిక సంక్షేమశాఖ సహాయ అధికారి (ఏఎస్‌డబ్ల్యూఓ) కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీనికితోడు భవనం శిథిలావస్థకు చేరింది. ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలో మొత్తం 29 హాస్టళ్లు ఉండగా వీటి పరిధిలో 10,201 మంది విద్యార్థులు ఆశ్రమం పొందుతున్నారు. ఈ భవనంలో ప్రతి నెలా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల హెచ్‌డబ్ల్యూఓలు సమావేశమవుతున్నారు. దీంతో పాటు హాస్టళ్లకు వచ్చే చిక్కీలు, ఇతర వస్తువులు కూడా ఇక్కడే భద్రపరుస్తారు. ఇలాంటి కార్యాలయానికి భద్రత లేదు. కనీసం గేటు (ప్రహరి) లేదు. సాయంత్రం 5 గంటలు అయ్యిందంటే చాలు మందుబాబులు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇక్కడ చేరుకొని మినీ బార్‌ను తలపించేలా చేస్తున్నారు. దీంతో పాటు ఇక్కడే కొందరు పేకాట ఆడుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు.

గేట్లు ధ్వంసం చేస్తున్న మందుబాబులు..

మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయ గేట్లు, ఇతర వస్తువులు ధ్వంసం చేస్తున్నారు. ఉరవకొండకు గతంలో రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యూఓగా ఉన్న రామ్మోహన్ బదిలీపై రాయదుర్గానికి వెళ్లిపోవడంతో ఉరవకొండకు రెగ్యులర్ అధికారి లేక పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా అధికారులు ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయానికి భద్రత కల్పించి, అసాంఘిక కార్యాకలాపాలు జరగడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


ఏఎస్‌డబ్ల్యూఓ ప్రధాన ద్వారానికి గేటు లేని దృశ్యం


అక్రమ ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు

ఆగని ఇసుక అక్రమ రవాణా

డి హీరేహాళ్(రాయదుర్గం): నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దునున్న డి హీరేహాళ్ మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు పడడంలేదు. బాదనహాళ్ హగరితో పాటు చుట్టుపక్కల వంకలు, వాగుల్లోని ఇసుకను అక్రమంగా కొల్లగొట్టి ట్రాక్టర్ల ద్వారా సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడి డంప్ నుంచి రాత్రివేళ టిప్పర్లలోకి లోడ్ చేసి బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. శనివారం హిర్దేహాళ్ సమీపాన యల్లమ్మ వంక వద్ద వెలుగు చూసిన ఇసుక డంప్‌ను ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలసి వెళ్లి సీజ్ చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా అడ్డుకట్టు వేస్తామన్నారు.

డివైడర్ల సుందరీకరణకు చర్యలు

రాయదుర్గంటౌన్: ప్రధాన రహదారిలో డివైడర్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో శిథిలావస్థకు చేరుకొని కళావిహీనంగా మారిన విషయం తెలిసిందే. మధ్యలో చెట్లు, ముళ్ల కంపలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈవిషయమై మే నెలలో 'సాక్షి'లో 'అధ్వాన్నంగా..డివైడర్లు' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు తాజాగా డివైడర్ల సుందీకరణకు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ డివైడర్లలోపు మట్టిని, చెట్లను తొలగించి కొత్త అందమైన చెట్లను పెంచే కార్యక్రమంతో పాటు మరమ్మతులు చేపట్టేందుకు రూ.7.50 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

'కూటమి' మోసాలను ఎండగడదాం


అనుంపల్లిలో పథకాలపై ఆరాతీస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు

శెట్టూరు: కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి బోయ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తిప్పనపల్లి, అనుంపల్లి, కనుకూరు గ్రామాల్లో ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి బాబు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలుపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బాబు రూ. 1000 పింఛన్ పెంపిచనట్లు పెంచి గ్రామాల్లో అర్హుల పింఛన్లు తొలగించడం సరికాదని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి, పార్టీ అనుబంధ నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, హరినాథ రెడ్డి, ప్రతాప్, కిష్టప్ప, మాదయ్య, చౌడప్ప, సర్పంచులు పాలయ్య, వెంకటేశులు, ఎంపీటీసీలు ప్రకాష్, ప్రహ్లాద , తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక

మూడు గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తిప్పనపల్లి అధ్యక్షులుగా ఆనందప్ప, ఉపాధ్యక్షుడిగా శివమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, కార్యదర్శిగా లక్ష్మణమూర్తి, అనుంపల్లి అధ్యక్షుడిగా ఉప్పర హనుమంతరాయుడు, ఉపాధ్యక్షుడిగా జి. పాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా నగేష్ బాబు, కనుకూరు గ్రామ అధ్యక్షుడిగా కురుబ సిద్ద లింగప్ప, ఉపాధ్యక్షుడిగా వీరాంజనేయులు, ప్రధాన కార్యదిర్శి మల్లికార్జున, కార్యదర్శి శోభన్ బాబు, సభ్యులు దుర్గేష్, రమేష్, రవి, గుజ్జారి హనుమంతురాయుడు, నాగప్పలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం రూరల్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వసంతబాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ లింగ నిర్ధారణపై క్షేత్రస్థాయిలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్ల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. హై స్కూల్స్, కేజీబీవీలు ప్రైవేట్, గవర్నమెంట్ విద్యా సంస్థలలో గర్భస్థ లింగ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, ఆరోగ్య విద్య బోధకులు కెంచె లక్ష్మీనారాయణ, ప్రభుత్వాసుపత్రి స్త్రీ వ్యాధి నిపుణులు ప్రసన్న భారతి, డాక్టర్ శశికళ, ఆర్‌డీటీ గైనకాలజిస్టు గిరి కుమారి, సీడీపీఓ రాధ, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు :

ఎరువుల దుకాణదారులు కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్‌డీఓ వసంతబాబు హెచ్చరించారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఎరువుల డీలర్లు, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అనుమతి పొందిన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎలప్ప, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మండలాల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఉపాధ్యాయ కొలువులు

రాయదుర్గంటౌన్: పట్టణ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు ముగ్గురు డీఎస్సీ–2025 మెరిట్ జాబితాలో ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పట్టణంలోని 14వ సచివాలయానికి చెందిన ఎడ్యుకేషన్ సెక్రటరీ జీఎం రాజు, 18వ సచివాలయానికి చెందిన శానిటరీ సెక్రటరీ హిమబిందు, 6వ సచివాలయానికి చెందిన శానిటరీ సెక్రటరీ సీఆర్ మల్లికార్జునలు ఉపాధ్యాయ పోస్టులు సాధించారు.

డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటిన కానిస్టేబుల్ దాదాపీర్



కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన దాదాపీర్ డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ కొలువు సాధించారు. దాదాపీర్ ఐదేళ్ల క్రితం కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. అయితే ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతో డీఎస్సీ రాశాడు. కానిస్టేబుల్‌గా పుట్లూరు, పెద్దపప్పూరు, యాడికిలో పనిచేశాడు.

గిరిజనులపై దాడి అమానుషం

ఉరవకొండ: నియోజకవర్గంలో దళిత, గిరిజనులపై టీడీపీ గూండాలు దాడులు అధికమయ్యాయని, ఏకపక్షంగా దాడులు జరుగుతున్నా పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ పట్టణ కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ లత్తవరం తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తులసీ ట్రాక్టర్‌తో ఢీకొట్టి, దాడి చేయడం సరికాదన్నారు.ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారిపై దాడులు, మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు వ్యవస్థ కళ్లు మూసుకోవడం సరికాదన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


ఉరవకొండ గవిమఠం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం ఆవరణలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాలను శుభ్రం చేయించారు. గవిమఠం సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు పారిశుధ్య సిబ్బంది విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. సహాయ కమిషనర్ రాణి మాట్లాడుతూ గవిమఠం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, విస్తారంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది నారాయణస్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో.. : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఆదినారాయణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

రాయదుర్గంటౌన్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. శనివారం రెండో వార్డులో డ్రైడే, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో ర్యాలీ నిర్వహించి, పరిసరాల శుభ్రతపై సూచనలు అందజేశారు. వారానికికోసారి కచ్చితంగా డ్రైడే పాటిస్తే దోమల నివారణ సాధ్యపడుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలి

కూడేరు: పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని..పారిశుధ్యం, స్వచ్ఛత నెలకొల్పడంలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలనిడీటీ ఉదయ్ భాస్కర్ పిలుపు నిచ్చారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ శాంతకుమారి, వీఆర్వోలు, ఇతర సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వజ్రకరూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎం రాజ్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పీసీ కొత్తకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై హెచ్‌ఎం రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) నాగమద్దయ్య హెచ్చరించారు. శనివారం రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) చంద్రశేఖర్ రెడ్డి, ఈఎస్ బీ రామమోహన్‌రెడ్డితో కలసి సందర్శించా రు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నూతన బార్ పాలసీ విధానంపై అవగాహన కల్పించారు. రాయదుర్గం పట్టణంలోని 2025-28 వ సంవత్సరానికి గాను రూ.55 లక్షలు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఉంటుదన్నారు. ఒక్కో బార్‌కు రూ.5 లక్షలు ప్రకారం 4 దరఖాస్తులు తప్పక రావాలన్నారు. వేలం పద్ధతిలో కాకుండా లాటరీ ద్వారా బార్ కేటాయిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటలకు వరకు సమయం ఉంటుందన్నారు. 26 నుంచి 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న జెడ్పీ హాలులో డిప్ తీస్తామన్నారు. దాబాలు, ప్రైవేట్ స్థలాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా కట్టడి చేస్తామన్నారు.

బార్ల కోసం దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ నిర్వహణ కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుపర్తిలో అష్టదిక్పాలక పూజ


తగ్గుపర్తి గ్రామ పొలిమేరల్లో అష్టదిక్పాలక పూజ చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల పరిధిలోని తగ్గుపర్తిలో గ్రామాభివృద్ధి కోసం గ్రామప్రజలు గ్రామ భజన బృందం ఆధ్వర్యంలో శనివారం అష్టదిక్పాలక పూజ చేశారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించిన అనంతరం గ్రామ పొలిమేరల్లో నాలుగు దిక్కుల్లోనూ పూజలు చేశారు.

అధికవర్షానికి కుళ్లిన కంది పంట

వజ్రకరూరు: గంజికుంటకు చెందిన హుమయూన్ అనే రైతు పొలంలో సాగుచేసిన కందిపంట అధిక వర్షానికి కుళ్లిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా హుమాయూన్ అనే రైతు తనకున్న 5 ఎకరాల్లో కంది పంట సాగు చేశాడు. ఇటీవల కురిసన భారీవర్షానికి కంది పంట మొత్తం కుళ్లిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు హుమాయూన్ కోరుతున్నాడు.


గంజికుంట వద్ద కుళ్లిన కందిపంటను చూపుతున్న రైతు హుమయూన్

వైభవంగా అభయాంజనేయస్వామి రథోత్సవం


రాయదుర్గంలోని అభయాంజనేయస్వామి రథోత్సవం


కోదండరామాలయంలో ప్రత్యేక పూజలందుకున్న సీతారాములు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద వెలసిన అభయాంజనేయ స్వామి 13వ వార్షిక బ్రహ్మ రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో రథాంగహోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 12.30 గంటలకు మడుగుతేరు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించారు. బళ్లారి రోడ్డులోని ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం శనివారం విశేష పూజలు జరిగాయి. సాయంత్రం స్వామి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన నేమకల్లు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. 21 రకాల ఫలాల అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు వైద్యం అనిల్‌కుమార్ చార్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ చేశారు. స్వామికి అమావాస్య, చివరి శనివారం సందర్భంగా విశేష ఫలాల మాలలతో అలకరించారు. ఆలయ కమిటీ అన్నదానం చేసింది. ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

కూడేరు: కూడేరు కోదండరామాలయంలో శనివారం సీతారాముల దేవతామూర్తులకు ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల మూలవిరాట్లను పట్టువస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు. ఈపూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

ఎర్రితాతస్వామికి పూజలు



బెళుగుప్ప: స్థానిక శాంతిధామంలో అమావాస్యను పురస్కరించుకొని ఎర్రితాతస్వామికి శనివారం పూజలు అభిషేకాలు నిర్వహించారు. శాంతిధామంలో రాత్రి పూజల్లో భాగంగా ఆలయంలో ఎర్రితాత స్వామి వారి పల్లకీని మోస్తూ భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనుంజయ, రాధ దంపతులు దాతలుగా అన్నదాన చేశారు.

సంక్షిప్త సమాచారం

సుఖ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాయదుర్గంటౌన్: హెచ్‌ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ తెలిపారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వ్యాధుల నివారణ, జాగ్రత్తలు, నష్టాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికులకు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, టీబీ యూనిట్ ల్యాబ్ టెక్నీషియన్ సురేష్ పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

రాయదుర్గంటౌన్: కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్లలో భాగంగా ఈ నెల 26 వరకు రిజిస్ట్రేషన్, విద్యార్థుల సర్టిఫికెట్ల అప్లోడ్ చేయనున్నట్లు తెలిపారు. 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని, వెబ్ ఆప్షన్లను మార్చుకోవడానికి 29 వతేదీ అవకాశం ఉంటుందన్నారు.

వంట గ్యాస్ అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

బొమ్మనహాళ్: వంట గ్యాస్‌ను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్‌లో కేబీఎస్ భారత్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై వినియోగదారులకు విక్రయంపై విచారణ చేశారు. గ్రామంలో భారత్ గ్యాస్ వాడుతున్న వినియోగదారుల ఇళ్లకు వెళ్లి విచారించారు. రూ.950కి సిలిండర్‌ను ఇస్తున్నారని, లబ్ధిదారులు డీఎస్‌ఓ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక భారత్ గ్యాస్ బ్రాంచ్‌లో గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రూ. 920కు ఇవ్వాల్సిన సిలిండర్‌ను అదనంగా రూ.30 వసూళ్లు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వారికి షోకాజ్ నోటీస్ ఇస్తున్నట్లు తెలిపారు.

గంబూషియా చేప పిల్లల విడుదల

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సుబేదర్, ఊరి చెరువులోకి 8వేల గంబూషియా చేప పిల్లలను శనివారం వదిలారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికెన్ గునియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ధరమ్‌సింగ్, హెల్త్ అసిస్టెంట్లు జాన్సన్, గంగరాజు, వీరేశఖర్, మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గం నియామకం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులోని రుక్మిణీ పాండురంగస్వామి కళ్యాణ మంటపంలో వీహెచ్‌పీ సమావేశం శనివారం జరిగింది. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు దేవిరెడ్డిపల్లి రాజేష్ అధ్యక్షతన మండల అధ్యక్షుడిగా కొట్టాలపల్లి రమేష్, ఉపాధ్యక్షులుగా అవిరెడ్డి భాస్కర్, కటిక రవీంద్రనాథ్, కార్యదర్శిగా శ్రీపూజారి దివాకర్, సహకార్యదర్శిగా దాసరి వెంకటేష్, కోశాధికారిగా మెట్టు గిరిజారెడ్డి, భజరంగదళ్ కన్వీనర్ వీరేష్ ఆచారిని ఎంపిక చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బెళుగుప్ప: మండలంలోని ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని గురుశ్రీ ఫెర్టిలైజర్, మన గ్రోమోర్ దుకాణాలను ఏఓ పృథ్వీసాగర్, ఏఎస్ఐ రామదాసుతో కలసి తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకుందాం

రాయదుర్గంటౌన్: వినాయక చవితి, మిలాదున్ నబీ పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అర్బన్ యూపీఎస్ సీఐ జయనాయక్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రభుత్వ ఖాజీలు మహమ్మద్ సైపుల్లా, అతావుర్ రెహమాన్, మసీదు కమిటీ ముతవల్లీలు, సభ్యులు హాజరయ్యారు.

వినాయక ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి

గుమ్మఘట్ట: గ్రామీణ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతి తప్పక తీసుకోవాలని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. వినాయక మంటపాలను ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.